సాక్షి
మహబూబాబాద్
బుధవారం । 29 । జనవరి । 2025



వేసవికి సన్నద్ధం కావాలి
వేసవిలో విద్యుత్ సమస్యలు నివారించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు.
- 8లో▸



రేషన్ బియ్యం పట్టివేత
ఓ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 216క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్‌రావు తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
35.7°/16.8°

వాతావరణం
జిల్లాలో ఉదయం చలి ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి పొగమంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి
- డీఐఈఓ మదార్‌గౌడ్



మహబూబాబాద్ అర్బన్: ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సీహెచ్.మదార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై ప్రిన్సిపాళ్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మదార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 29 నుంచి 30 వరకు మానవ, నైతిక విలువల, 31 ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు సైన్స్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించబడుతాయని, ఈ పరీక్షలను ఎలాంటి అవకతవకలు జరగకుండా సజావుగా, సీసీ కెమెరాల పరిరక్షణలో నిర్వహించాలని తెలిపారు. ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు పాక్కుల సదానందం, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

గార్ల: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గార్ల తహసీల్దార్ కె.రవీందర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మంగళవారం ఉత్వర్వులు జారీ చేసినట్లు తెలిసింది. కాగా, గార్ల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

బస్సు సౌకర్యం కల్పించాలి




నెహ్రూసెంటర్: ఆర్టీసీ మహబూబాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి 21 మంది నుంచి సలహాలు, సూచనలు వచ్చినట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలి పారు. మహబూబాబాద్ టూ ఖమ్మం వయా గార్ల మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని, మహబూబాబాద్ టూ కల్వల, కేసముద్రం మీదుగా వరంగల్, మహబూబాబాద్ నుంచి కొర్పోలు మీదుగా అదనపు సర్వీసులు కావాలని కోరినట్లు తెలిపారు. మరిపెడ నుంచి బావోజీగూడెం, మరిపెడ టూ హైదరాబాద్, బలపాల నుంచి డోర్నకల్, లింగాల, ఇల్లందు వరకు, గూడూరు నుంచి గాజులగట్టు, గుండెంగ మీదుగా నెక్కొండ, మహబూబాబాద్ నుంచి కేసముద్రం, ఇనుగుర్తి, అన్నారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు విన్నవించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు కోరిన రూట్లను పరిశీలించి బస్సు సౌకర్యం అందించేలా చర్యలు తీసుకుంటామని డీఎం శివప్రసాద్ తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు సైన్స్ ఉపాధ్యాయుడు



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ సైన్స్ ఉపాధ్యాయుడు, విద్యా పరిశోధకుడు డాక్టర్ గురునాథరావు అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. ఈ సదస్సు నేటి నుంచి ఈ నెల 31 వరకు తమిళనాడులో టీచర్స్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ విద్యా ప్రణాళిక పరిపాలనా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సులో గురునాథరావు తన పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. గురునాథరావును డీఈఓ రవీందర్, జిల్లా సైన్స్ అధికారి,పెనుగొండ హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



కేసముద్రం: మండలంలోని పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్పెషల్ టెస్టును పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి స్పెషల్ టెస్టుకు హాజరయ్యే విధంగా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న గదులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ కాలేరు యాదగిరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బోనస్ ఎక్కడ?



రైతులకు అందని సన్నధాన్యం బోనస్
- ఆశతో కొనుగోలు కేంద్రాల్లో వడ్లను విక్రయించిన రైతులు
- జిల్లా వ్యాప్తంగా రూ.41 కోట్ల పెండింగ్
- అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: సన్నధాన్యం సాగుచేసిన రైతులకు ప్రోత్సాహం, గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సన్న ధాన్యం సాగుచేసిన ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు నిరాశే ఎదురైంది. బోనస్ వస్తుందనే ఆశతో ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా.. బోనస్ డబ్బులు రాకపోవడంతో ప్రభుత్వ కార్యలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. త్వరగా బోనస్ డబ్బులు వస్తే యాసంగి పంటలకు పెట్టుబడి అవుతుందని అధికారులను ఆశపడుతున్నారు.

1,54,630 టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలోని వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,84,274 మెట్రిక్ టన్నుల సన్నరకం, 74,266 మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇందులో ఆహారానికి, విత్తనాలకు, ఇతర ప్రైవేట్ వ్యాపారుల కొనుగోలు పోగా 2,24,516 మెట్రిక్ టన్నుల సన్నరకం, 64,266 మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనాలు వేశారు. ఇందులో భాగంగా 239 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 33 రకాల సన్నధాన్యానికి మద్దతు ధర క్వింటాకు రూ.2,321 కి రూ.500 బోనస్ కలిపి మొత్తం రూ.2,821 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కొనుగోళ్లు ముగిసేనాటికి జిల్లాలో 32,773 మంది రైతుల నుంచి రూ.358,55,02,876 విలువచేసే 1,43,644 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 10,985 మెట్రిక్ టన్నుల కామన్ గ్రేడ్ ధాన్యం మొత్తం 1,54,630 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఇప్పటి వరకు 32,995 మంది రైతుల రూ.354,03,53,776 విలువచేసే 1,52,697 మెట్రిక్ టన్ను ధాన్యం అన్‌లైన్ చేసి రూ.343,39,85,200 చెల్లించారు. మిగిలిన 947 మంది రైతులకు 10,63,68,576 చెల్లించాల్సి ఉంది.

చెల్లింపులో జాప్యం

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి ముందుగా ప్రకటించిన విధంగా డబ్బులు చెల్లించిన ప్రభుత్వం.. సన్న ధాన్యానిక క్వింటాకు రూ.500 చొప్పున చెల్లిస్తామని ప్రకటించిన బోనస్ చెల్లింపులో జాప్యం చేస్తుంది. ఇప్పటి వరకు 29,211 మంది రైతుల నుంచి సేకరించిన 1,27,080 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యానికి రూ.63,54,03,400 బోనస్ ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 10,620 రైతులు అమ్మిన 48,881 మెట్రిక్ టన్నులకు రూ.24,44.06,400 మాత్రమే చెల్లించారు. మిగిలిన 17,591 మంది రైతులు అమ్మిన 78,199 మెట్రిక్ టన్నుల ధాన్యం బోనస్ రూ.36,09,97,400 గత రెండు నెలలుగా రావడం లేదని రైతులు చెబుతున్నారు.

నెల దాటినా జమ కాలేదు



నాకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా 65 తట్టు బస్తాలు వడ్లు పండాయి. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో డిసెంబర్ 5వ తేదీన 31 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. బోనస్ రూ.15 వేలు డబ్బులు రావాలి. నెల దాటుతున్నా ఇంతవరకు డబ్బులు జమ కాలేదు.

- కొత్త శేఖర్, రైతు, చిన్నగూడూరు

ఎదురుచూస్తున్నాం..



వ్యవసాయమే ఆధారంగా జీవించే మేం పొలం కౌలుకు తీసుకొని సాగుచేశాం. బయ్యారం సొసైటీలో 40రోజుల క్రితం 449 బస్తాల సన్న ధాన్యం కాంటా పెట్టాను. అసలు డబ్బులు వచ్చాయి. బోనస్ డబ్బులు రాలేదు. ఈ డబ్బులు వస్తే యాసంగి పెట్టుబడికి ఉపయోగపడతాయి. వాటికోసమే ఎదురుచూస్తున్నా..

- ఏనుగుల రంజిత్, కౌలు రైతు బయ్యారం

ఆశతోనే సన్న రకం వేశాను



ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందనే ఆశతోనే సన్న రకం సాగుచేశాను. పంట దిగుబడి తక్కువ వచ్చింది. పండిన 64 క్వింటాళ్లు కొనుగోలు కేంద్రంలో అమ్మి 45 రోజులు దాటినా బోనస్ పడలేదు. తొందరగా బోనస్ అకౌంట్ లో జమచేయాలి.

- ఆకుతోట రఘుపతి, నర్సింహులపేట

త్వరలో వస్తాయి



కొంత మందికి ఇప్పటికే డబ్బులు అకౌంట్‌లో జమ అయ్యాయి. అధికారులందరం కొత్త పథకాల పనిలో నిమగ్నమయ్యాం. ఒకటి రెండు రోజుల్లో ఫ్రీ అవుతాం. తర్వాత ఉన్నతాధికారులతో మాట్లాడి అందరికీ త్వరగా బోనస్ డబ్బులు పడేలా చూస్తా.

- వెంకటేశ్వర్లు, సహకారశాఖ జిల్లా అధికారి

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



నేరడ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- నేరడ హైస్కూల్, కేజీబీవీల తనిఖీ

కురవి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషిచేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. కురవి మండలం నేరడ హైస్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. వంట గది, ఆహార పదార్థాలు, మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులో మాట్లాడారు. విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ప్రణాళిక బద్ధంగా, క్రమశిక్షణతో చదువుకోవాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు చదవాల్సిన కోర్సులపై ఉపాధ్యాయులు గైడెన్స్ అందించాలన్నారు. మెనూ చాట్ ప్రకారం భోజనం అందచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నేరడ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సాయిలు, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ దయ్యాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

చిన్నగూడూరు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత,కేజీబీవీ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసర ప్రాంతాలు,వంటగదులు,మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ లలిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'సూపర్ స్పెషాలిటీ' ప్రారంభం

ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సీఎం నిర్ణయం
- మరింత వేగంగా ఆస్పత్రి నిర్మాణ పనులు
- వివిధ పనులపై 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ జిల్లా అభివృద్ధిపై పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, రామచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డితోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వరంగల్ నగరంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరలో ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాంపూర్-మడికొండ మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ పొగ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే డంపింగ్ యార్డ్‌ను అక్కడినుంచి తరలించాలని కోరారు. గ్రేటర్ వరంగల్ నగరానికి మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనుల డీపీఆర్ తయారు చేసి త్వరితగతిన పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలివ్వాలని ఎమ్మెల్యేలు.. సీఎంను కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ సంబంధిత అధికారులకు ఫోన్‌లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 31న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీగా ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కడియం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

యాక్సిడెంట్స్ ఫ్రీగా మార్చడమే లక్ష్యం





బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, పోలీసులు

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: రోడ్డు భద్రత నియమాలు పాటించడం అందరి బాధ్యత, జిల్లాను యాక్సిడెంట్ ఫ్రీగా మార్చడమే తమ లక్ష్యమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి నెహ్రూ సెంటర్ మీదుగా అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్ రోడ్డు, బస్ స్టాండ్ రోడ్డు, నర్సంపేట బైపాస్, వైఎస్సార్ విగ్రహం, మున్సిపల్ ఆఫీస్ నుంచి తిరిగి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం చిన్నదే అయినా ఆప్రభావం కుటుంబాలపై పడుతుందన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాల నుంచి మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో 60 నుంచి 70 శాతం యువతే ఉన్నారని చెప్పారు. ఇటీవల కాలంలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని, రాష్ డ్రైవింగ్ చేసి కష్టాల పాలవకుండా బాధ్యతగా ఉండాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిరోజు రోడ్డు భద్రతపై కొంత అవగాహన కల్పించాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించి సహాయం చేస్తున్న శ్రీనివాస్ అనే యువకుడిని సన్మానించి హెల్మెట్ బహుకరించారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, టౌన్, రూరల్, బయ్యారం సీఐలు దేవేందర్, సరవయ్య, రవి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

తొర్రూరు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో హెల్మెట్లు ధరించి పోలీస్ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐ గణేష్, ఎస్సైలు ఉపేందర్, రమేష్‌బాబు, రాజు, రాంజీనాయక్, సురేష్ పాల్గొన్నారు.

షేడ్‌నెట్లలో నారు పెంపకం లాభదాయకం



శిక్షణలో పాల్గొన్న యువ రైతులు

మహబూబాబాద్ రూరల్: షేడ్‌నెట్లలో నారు పెంచుకుని ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ మాలతి అన్నారు. యువ రైతులకు ఆర్య ప్రాజెక్టులో భాగంగా నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మంగళవారం నర్సరీలో నారు పెంపకం, కూరగాయల పంటల నారు పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ ద్వారా యువ రైతులు మెళకువలను నేర్చుకుని పంటలు వేసుకునే నారు పెంపకంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. షేడ్ నెట్ల ద్వారా కూరగాయల పంటలు, వాటి నారు పెంపకంపై తీసుకున్న శిక్షణ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి మరియన్న, మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త నాగరాజు, మల్యాల కేవీకే శాస్త్రవేత్త, శిక్షణ కార్యక్రమం ఇంచార్జి బి.క్రాంతికుమార్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, మల్యాల జేవీఆర్ హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త ప్రశాంత్, మానుకోట ఉద్యాన అధికారి శాంతిప్రియదర్శిని పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ



అదనపు కలెక్టర్ లెనినల్ వత్సల్ టొప్పోకు శుభాకాంక్షలు తెలుపుతున్న మానుకోట కమిషనర్, అధికారులు



కేసముద్రం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసన్నరాణి

మహబూబాబాద్/తొర్రూరు: మున్సిపాలిటీల పాలక మండలి పదవి కాలం పూర్తి కావడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు మానుకోట, తొర్రూరు మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో మానుకోట మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్‌తోపాటు జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. మేనేజర్ కట్టా స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

కేసముద్రం మున్సిపల్ కమిషనర్‌గా ప్రసన్నరాణి

కేసముద్రం: కేసముద్రం మున్సిపల్ కమిషనర్‌గా కే.ప్రసన్నరాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కొనసాగిన కేసముద్రంస్టేషన్ జీపీ భవనంలోనే ఆమె ఈ బాధ్యతలు చేపట్టారు. ఈనెల 25న కేసముద్రం మున్సిపాలిటీ చేస్తూ గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నియామకంతోపాటుగా, స్పెషల్ ఆఫీసర్‌గా షాహిద్ మసూద్, అసిస్టెంట్ ఇంజనీర్‌గా ముజామ్మిల్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా అవినాష్, అకౌంటెంట్‌గా శ్రీదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా, మంగళవారం నుంచి కేసముద్రం మున్సిపాలిటీ పరిపాలన అమల్లోకి వచ్చింది. కేసముద్రం స్టేషన్, కేసముద్రంవిలేజ్, అమీనాపురం, ధన్నసరి, సబ్‌స్టేషన్‌జీపీలకు ఇప్పటి వరకు కొనసాగిన కార్యదర్శులతో, కమిషనర్ ప్రసన్నరాణి ప్రత్యేక సమావేశం నిర్వహించి, జీపీలకు చెందిన చెక్‌బుక్స్‌తోపాటు, పలు రికార్డులు స్వాధీన పరుచుకున్నారు. కాగా, వీలీన గ్రామాల్లోని జీపీ భవనాలు నిరుపయోగం కాకుండా, వార్డు కౌన్సిల్ ఆఫీస్‌లుగా మార్చనున్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసన్నరాణిని కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం, ధన్నసరి సొసైటీ వైస్‌చైర్మన్లు అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, ఆర్‌టీఏ సభ్యుడు మురళీ, వెంకన్న, సురేందర్, వసంతరావు, రమేశ్, అయూబ్ ఖాన్, వెంకటేష్, సమ్మయ్య, తాజుద్దీన్ ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరాంనాయక్



మాట్లాడుతున్న దేశీరాంనాయక్

మహబూబాబాద్ అర్బన్: యువత ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోతు దేశీరాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశీరాంనాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత, గిరిజన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఐటీడీఏ పీఓ చిత్రమిశ్ర మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ జాబ్‌మేళాలకు 2,000 మంది హాజరుకాగా 500 మందికి ఉద్యోగ ఉత్తర్వులు అందజేశారు. ఐటీడీఏ ఏఓ రాజ్‌కుమార్, ఎస్‌ఓ సురేశ్‌బాబు, డీటీ ఆర్వైఫ్ఆర్ కిషోర్, మేనేజర్ శ్రీనివాస్, జేడీఎం కొండల్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, డీపీఎం నళినినారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి
- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



సమావేశంలో బడ్జెట్ అంచనాల పత్రాలను పరిశీలిస్తున్న లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్: విజ్ఞాన వంతమైన సమాజం కోసం గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ పాఠకులకు, పుస్తక ప్రియులకు ఉపయోగకరంగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల నుంచి గ్రంథాలయ పన్ను చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరం ఖర్చుచేసిన నిధుల వివరాలు, 2025-26 బడ్జెట్ అంచనాలను ఆమోదం కోసం పంపేందుకు సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీపీఓ హరిప్రసాద్, డీఈఓ రవీందర్‌రెడ్డి, డీపీఆర్వో శ్రీనివాస్, సంస్థ కార్యదర్శి శ్రీలత, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు.

హాస్టళ్ల ఇబ్బందులు తెలియజేయాలి

మరిపెడ రూరల్: విద్యార్థినులకు హాస్టల్లో ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో.. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సమస్యలు ఉంటే రాతపూర్వకంగా అందజేయాలన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలి

దంతాలపల్లి: విద్యార్థులు ఉండే వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని లోకల్ బాడీ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సూచించారు. మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అందించే నాణ్యమైన భోజనం, విద్యపై విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన విద్య అందించాలని సూచించారు. తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ప్రిన్సిపాల్ కోట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌కు 44 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: దేశంలో ప్రతిష్టాత్మక ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 సెంటర్లలో కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 1,243మంది అభ్యర్థులకు 1,208మంది హాజరుకాగా 35మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌ను మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించగా అందులో1,133 మంది అభ్యర్థులకు 1,124 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి 44మంది గైర్హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ కె. శ్రీలతారెడ్డి తెలిపారు.

ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన వారిలో యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ బీసీఎం రాజు, యూనివర్సిటీ న్యాయ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆర్. స్వరూపరాణి ఉన్నారు. వీరికి వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు.

కొనసాగుతున్న శిక్షణ..

కాకతీయ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎన్‌సీసీ జవాన్‌ల శిక్షణ కార్యక్రమంలో కొనసాగుతోంది. మంగళవారం ఈ శిక్షణలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి పాల్గొని 'ఆటోమేషన్ టాక్స్ విత్ మ్యాక్రోస్' అనే అంశంపై విస్తతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి రమ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం..

- ఉద్యోగం కోసం రూ.2.50 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

నెల్లికుదురు: ఓ యువకుడు ఆన్‌లైన్‌లో ఉద్యోగ ప్రకటన చూసి రూ.2.50 లక్షలు చెల్లించి మోసపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుది. బాధితుడు కాటమల్ల రాజు కథనం ప్రకారం.. సంవత్సరం క్రితం ఆన్‌లైన్ యాప్‌లో ప్రకటన చూసిన రాజు.. ఉద్యోగం కోసం సంస్థకు రూ.2.50 లక్షలు చెల్లించాడు. అనంతరం ఉద్యోగం కోసం సంస్థకు కొన్ని రోజులుగా ఫోన్ చేస్తున్నాడు. అయితే నిర్వాహకులు స్పందించడం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన రాజు.. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రంబుల్ స్ట్రిప్స్‌తోనూ 'ప్రమాదమే'?

మామూనూరు ఘటనాస్థలి వద్ద పరిమితికి మించి మందం

- 7.5 మి.మీలు ఉండాల్సి ఉండగా 30 మి.మీల వరకు ఏర్పాటు
- ఫలితంగా స్పీడ్ బ్రేకర్ల మాదిరి ఉండడంతో ప్రమాదాలు
- ఆటోలు, కార్ల వేగం పూర్తిగా తగ్గడంతో వరుస ఘటనలు
- భారీ వాహనాల వేగం అదుపు తప్పడంతోనే ప్రమాదాలు
- ఐఆర్ఎస్ నిబంధనలు పాటించాలంటున్న వాహనదారులు



రోడ్డు ప్రమాద స్థలం వద్ద పరిమితికి మించి మందంతో ఉన్న రంబుల్ స్ట్రిప్స్

సాక్షి, వరంగల్ : మామూనూరు వద్ద ఆదివారం ఉదయం 11.20 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణం ట్రైలర్ ట్రక్కు డ్రైవర్ డ్రంకెన్ డ్రైవ్ ఓ కారణం కాగా...ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ (ఐఆర్‌సీ 35–2015) నిబంధనలకు తిలోదకాలిచ్చి థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్‌ను స్పీడ్ బ్రేకర్స్ మాదిరి మందం ఎక్కువ ఉండేలా అధికారులు ఏర్పాటుచేయడం కూడా మరో కారణమనే చర్చ జరుగుతోంది. ఐఆర్ఎస్ నిబంధనల ప్రకారం.. థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్‌ను ఏదైనా జంక్షన్ లేదా వంపులు వచ్చే సందర్భాల్లో రోడ్లకు అడ్డంగా వేయాలి. రోడ్ల మధ్యలో, అంచుల వద్ద ఆఫ్ రోడ్‌లో వెళ్లేటప్పుడు డ్రైవర్లను అప్రమత్తం చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. అలాగే, థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీ కంటే ఎక్కువ ఉండకూడదు. కానీ మామూనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనాస్థలిలో ఆరు లేన్ల థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 30 మి.మీల వరకు ఉంది. ఫలితంగా అక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదన వినబడుతోంది. ఈ ఆరు లేన్లకు సమీపంలోనే మరో ఆరు లేన్ల థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీ ఉంది. వెంటవెంటనే ఉన్న ఈ స్ట్రిప్స్ వల్ల వేగంగా వచ్చే ఆటోలు, కారులు ఒక్కసారిగా వేగం తగ్గించడంతో వెనుక వచ్చే భారీ వాహనాలు వేగం అదుపు తప్పడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీలు ఉంటే అన్నీ వాహనాలు హైవేపై వచ్చే వేగంతో వెళ్లే అవకాశముంటుంది. అతి ఎక్కువ మందం ఉండడం వల్ల ఇక్కడ వాహనాల వేగం తగ్గడం.. దీనికితోడు ఆ పరిసర ప్రాంతాల్లోనే రెండు పెట్రోల్ బంక్‌ల నుంచి వచ్చే వాహనాల వల్ల కూడా హైవేపై వెళ్లే వాహనాల డ్రైవర్లకు ఇబ్బంది కలిగించే అంశంగా మారిందనే చర్చ ప్రభుత్వ విభాగాల్లో జరుగుతోంది. ముఖ్యంగా మామూనూరు వద్ద నిబంధనలకు విరుద్ధంగా సమీపంలో జంక్షన్ లేకున్నా, రోడ్డు కుంగిన ప్రాంతాలు లేకున్నా థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. అదీకాకుండా మందం ఎక్కువతో చేయడం కూడా రోడ్డు ప్రమాదానికి కారణమని తెలుస్తోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, సోమ, మంగళవారం కూడా ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగి స్వల్ప గాయాలతో బయటపడ్డారని గుర్తు చేసుకుంటున్నారు. జాతీయ రహదారిపై వేగ నియంత్రణ కోసం లేజర్ స్పీడ్ గన్స్ సంఖ్య పెంచాలి. ప్రమాద స్థలాన్ని వాహనదారులకు తెలిసేలా పవర్ బ్లింకర్స్, సైన్‌బోర్డులు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, సోలార్ స్టెన్స్ ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

రవాణా శాఖ అధ్యయనంలో తెలిసిన అంశాలు ఏమిటంటే..

- పంథిని శివారులో రోడ్డుకు సమానంగా లేని ఇరుకైన వంతెనను దాటుతుండగా యూరియా బ్యాగుల లోడ్‌తో వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను ట్రక్ డ్రైవర్ ఢీకొట్టాడు. ఇరుకైన వంతెన దగ్గర 20 మీటర్ల స్కిడ్ గుర్తులు కనిపించాయి.
- ఆటో డ్రైవర్ రంబుల్ స్ట్రిప్స్ దగ్గర తన వేగాన్ని తగ్గించే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చే వాహనాల గురించి వెనుక వీక్షణ అద్దాన్ని గమనించాలి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రంబుల్ స్ట్రిప్స్ దగ్గర వేగం తగ్గించే ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు.
- ట్రక్ డ్రైవర్ ఎక్కడ మద్యం సేవించాడు.. అతను ప్రమాద స్థలానికి చేరుకునే వరకు మద్యం సేవించిన తర్వాత ఎంత దూరం ప్రయాణించాడనే అంశం తెలియాల్సి ఉంది. పురపాలక పరిమితులు మినహా జాతీయ రహదారులపై మద్యం దుకాణాలు నిషేధించబడ్డాయి.
- మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో మినహా జాతీయ రహదారులపై ప్యాసింజర్ ఆటోలను అనుమతించరు.

వేసవికి సన్నద్ధం కావాలి

- ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలి
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: వేసవిలో విద్యుత్ సంబంధ సమస్యలు నివారించేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వేసవి కాలానికి అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 16 సర్కిళ్లకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. నేడు (బుధవారం) సర్కిళ్లలో జరిగే సమావేశంలో నోడల్ ఆఫీసర్లు పాల్గొని రూపొందించిన ప్రణాళిక మేరకు పనులు జరిగాయా లేదా అని సమీక్షించాలన్నారు. ఓవర్ లోడ్ ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని, అవసరమున్న చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సర్వీస్‌లో భాగమైన జిల్లా ఆస్పత్రులు, ఇతర సర్వీసులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ లైన్ల వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, వి.తిరుపతి రెడ్డి, సీఈలు రాజుచౌహాన్, బీకం సింగ్, అశోక్, కె.ఎస్. గుట్ట, తదితరులు పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమైంది..

- భార్యను కత్తితో పొడిచిన భర్త
- చికిత్స పొందుతూ మృతి



సుగుణ(ఫైల్)

కేసముద్రం: అనుమానం పెనుభూతమైంది. భార్యతో కడ వరకూ జీవించాల్సిన ఓ భర్త...ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. కర్రతో తలపై కొట్టి, ఆపై కత్తితో పొట్టలో పొడిచాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరిలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాంకుడోత్ రఘు.. గూడూరు మండలం చిన్న ఎల్లాపూర్‌కు చెందిన కున్‌సోతు హట్యా, తారి దంపతుల కూతురు సుగుణ(25)ను వివాహం చేసుకున్నాడు. రఘు జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా సుగుణపై రఘు అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడుతున్నాడు. ఈనెల 25న కూడా గొడవపడి క్షణికావేశంలో భార్య తలపై కర్రతో కొట్టి, ఆపై కత్తితో పొట్టలో పొడిచాడు. గమనించిన కుటుంబీకులు సుగుణను వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి హట్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

రూ. 3 లక్షల చెల్లిస్తే జాబ్ ఇప్పిస్తా..

- మొదట రూ. 10 వేలు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయండి.. జాబ్ రిజ్వర్ చేస్తాం
- ఎన్‌హెచ్ఎం అధికారులమంటూ అభ్యర్థులకు ఫోన్ కాల్స్



ఎంజీఎం : రూ. 3 లక్షల చెల్లిస్తే వైద్యారోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశావాహ అభ్యర్థుల ఫోన్ నంబర్‌లు సేకరించిన దళారులు.. ఎన్‌హెచ్ఎం అధికారుల పేరుతో వసూళ్ల దందాకు దిగుతున్నారు. కొన్ని నెలల క్రితం ఉద్యోగాల కోసం రాసిన పరీక్షలను ఆధారం చేసుకుని అభ్యర్థుల ఫోన్ నంబర్లు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం హనుమకొండ జీఎంహెచ్‌లో పనిచేసే ఓ ఉద్యోగికి 'మీరు రాసిన పరీక్షలో 74 మార్కులు వచ్చాయి..సెలెక్ట్ కాలేదు.. కానీ.. నేను సెలక్ట్ అయ్యేటట్టు చేస్తా.. ముందు మా అకౌంట్‌కు రూ. 10 వేలు పంపించండి.. ఆ డబ్బులు కూడా ఎలా మా అకౌంట్‌కు పంపించాలో మీరు మీ అకౌంట్‌లో డబ్బులు జమ చేసుకున్నాక చెబుతా.. రూ. 10 వేలు మా అకౌంట్‌కు పంపించగానే మీ జాబ్ లాక్ చేస్తాం.. ఇది ఇన్‌సైడ్ కాల్.. ఎవరికీ చెప్పొద్దు. చెబితే మీకు నష్టమే.. మాకూ నష్టమే.. మీ ప్రొవిజనల్ లిస్టు తయారు చేసి మెరిట్ లిస్టులో మీ పేరు వచ్చేలా చేస్తాం. అనంతరం ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యాక మాకు మిగతా 2.90 లక్షలు చెల్లించాలి.. మీకు మరో గంటలో ఫోన్ చేస్తా' అని సదరు ఉద్యోగికి 9883550117 అనే నంబర్ ద్వారా ఫోన్ వచ్చింది. ఇదే నంబర్‌తో మరో గంటకు ఫోన్ చేసి అకౌంట్‌లో డబ్బు జమ చేసుకున్నారా మా సార్‌కు మీతో మాట్లాడారని చెప్పారు.. అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయండి.. మీ జాబ్ లాక్‌చేశామని తిరిగి గంట తరువాత మరో ఫోన్ కాల్ చేస్తామన్నారు. ఇలా ఒకరిద్దరికి కాదు.. పరీక్ష రాసిన వందలాది మందికి దళారులు కాల్స్ చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే, ఎన్‌హెచ్ఎం అధికారుల మంటూ వస్తున్న ఫోన్ కాల్స్‌తో ఉద్యోగులు కూడా అయోమయానికి గురవుతున్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న చిరంజీవులు

హన్మకొండ : బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ కొంగ వీరస్వామిని నియమించారు. మంగళవారం హైదరాబాద్ జరిగిన కార్యక్రమంలో వీరస్వామిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు నియామక పత్రాన్ని అందించారు. జిల్లాలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరంను పటిష్టం చేయడంతో పాటు హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. బాధ్యతలు అప్పగించిన బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా.. అధికారులకు సూచించారు. కమిషనరేట్ పోలీసు అధికారులతో సీపీ మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్, డివిజనల్, జోన్ల వారీగా పెండింగ్ కేసుల్లోని నిందితుల అరెస్ట్, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల చర్చించారు. నేరాల కట్టడికి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో ముందుకు వెళ్లాలని, మహిళలకు సంబంధించిన కేసులపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. పెండింగ్, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేయాలని, సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలన్నారు. తప్పుడు కేసు నమోదు చేయొద్దని, పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతిభద్రతలు అదుపు తప్పుతాయని వివరించారు. రౌడీ షీటర్ల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, ఏఎస్పీ చేతన్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న టీచర్లపై ఫిర్యాదు?

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, గ్రామ యువకులు మండల విద్యాశాఖ అధికారులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిసింది. విద్యార్థినులతో కొంతమంది ఉపాధ్యాయుల ప్రవర్తన సరిగా లేదని యువకులు, తల్లిదండ్రులు హెచ్ఎంతో గొడవ పడ్డారని సమాచారం. అంతేకాకుండా సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో పోలీస్ జట్లు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న వరంగల్ కమిషనరేట్ జట్టు



యాదాద్రి జోన్ జట్టు



కాళేశ్వరం జోన్ జట్టు



భద్రాద్రి జోన్ జట్టు

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాష్ట్రస్థాయి 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభమైంది. వివిధ జోన్ల నుంచి 2,380మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని పలుజోన్లు, వరంగల్ కమిషనరేట్ జట్టు పాల్గొన్నాయి. ముందుగా ఆయా జట్లు మార్చ్‌ఫాస్ట్ చేశాయి. - కరీంనగర్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



మాట్లాడుతున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

విద్యారణ్యపురి : తాను వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండబోతున్నానని, తనను గెలిపిస్తే ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఎస్‌టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరునెలలుగా ఈ–కుబేర్‌లోపెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా సంపూర్ణ వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంకా మిగిలిన 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వతరెడ్డి, జనరల్ సెక్రటరీ సదానందగౌడ్, టీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చెన్నయ్య,ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, బీసీటీఏ అధ్యక్షుడు కృష్ణుడు, బీసీటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పెంట అంజయ్య, ప్రధాన కార్యదర్శి దానయ్య, టీజీహెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షుడు జి. హేమచంద్ర, ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య మాట్లాడారు. సమావేశంలో ఎస్‌టీయూ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, మధు లిమాయే, వేమునూరు రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఈజీఎస్ ఈసీ దుర్మరణం

- ఆలేరు రైల్వే స్టేషన్‌లో ఘటన



జగదీశ్ (ఫైల్)

బచ్చన్నపేట : మండల కేంద్రంలో ఈజీఎస్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్న కోరాటి జగదీశ్ (41) రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి ఆలేరు రైల్వే స్టేషన్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన జగదీశ్ బచ్చన్నపేట మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ హైదరాబాద్ నుంచి రైలులో ఆలేరు వరకు వచ్చి అక్కడి నుంచి బైక్‌పై బచ్చన్నపేటకు వస్తాడు. ఈ క్రమంలో సోమవారం విధులు ముగించుకుని బైక్‌పై ఆలేరు వెళ్లి అక్కడి రైల్వేస్టేషన్‌లో పార్క్ చేశారు. అనంతరం రైలు ఎక్కడానికి పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, ఏపీఓ కృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జగదీశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



రాజు మృతదేహం

ఎల్కతుర్తి : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీతకార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొక్కిస రాజు(35) రోజుమాదిరిగానే కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. కల్లు దింపుతున్న క్రమంలో మోకు జారీ చెట్టుపై నుంచి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

216 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- అప్పరాజ్‌పల్లిలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులో ఘటన



పట్టుకున్న బియ్యం లారీని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

గూడూరు : ఓ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రూ. 7.12 లక్షల విలువైన 216 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఓ లారీ, రెండు ద్విచక్రవాహనాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ రావు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజ్‌పల్లిలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లు యజమాని భూక్య నవీన్ కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగిన్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రూ. 7.12 లక్షల విలువైన 216 క్వింటాళ్ల (432 బస్తాలు) రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్నాడు. అలాగే, ఇద్దరు వ్యక్తులు గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ద్విచక్ర వాహనాలపై మిల్లుకు తరలిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, జిల్లా సివిల్ సప్లై అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని మిల్లులో తనిఖీ చేపట్టి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసముద్రంలోని గిడ్డంగికి తరలించారు. అనంతరం రెండు ద్విచక్రవాహనాలు, లారీని గూడూరు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో మిల్లు సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఓఎస్డీ ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ స్పెషల్ ఆఫీసర్ (హైదరాబాద్) లక్ష్మారెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్‌కుమార్, ఎస్సై గిరిధర్ రెడ్డి, ఎంఆర్ఐ మల్లయ్య, ఏఎస్‌ఓ రమేశ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్ : మహా కుంభమేళా యాత్రీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు అదనపు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

ఫిబ్రవరి 5వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (07079) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17.00 గంటలకు చేరుకుంటుంది. ఫిబ్రవరి 7వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07080) ఎక్స్‌ప్రెస్ 8వ తేదీన కాజీపేటకు రాత్రి 21.45 గంటలకు చేరుతుంది. ఫిబ్రవరి 7వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (07077) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17.00 గంటలకు చేరుతుంది. ఫిబ్రవరి 9వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ 10వ తేదీన 21.45 గంటలకు కాజీపేటకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లకు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగ్‌పూర్, ఇటార్సీ, పిపర్యా, జబల్‌పూర్, కట్నీ, సంత, మణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, చోకి, మీర్జాపూర్, పండిట్ దిన్ దయాల్ ఉపాధ్యాయ, బాక్సర్, అరా స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.